# ఇక ఆన్‌లైన్‌లో నిక్షిప్తం

- అభయ హస్తం దరఖాస్తుల కంప్యూటరీకరణ ప్రారంభం
- ప్రతీ మండలంలో 25 నుంచి 30 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు
- జిల్లాలో 7.24 లక్షల దరఖాస్తులు



**సాక్షి, మేడ్చల్ జిల్లా:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ప్రజా పాలన కార్యక్రమంలో పోటెత్తిన దరఖాస్తులన్నీంటిని ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. దరఖాస్తుదారుల వివరాలు(సమాచారం)ఆన్‌లైన్‌లో నమోదు చేయటానికి వాటి సంఖ్యను బట్టి ప్రతీ మండలానికి 25 నుంచి 30 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియిమంచారు. ప్రతీ రోజూ రెండు షిఫ్టుల్లో భాగంగా దరఖాస్తుదారుల వివరాలను నమోదు చేసే ప్రక్రియను అధికార యంత్రాంగం మొదలు పెట్టింది. నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని 15 మండలాల పరిధిలో దరఖాస్తుదారుల వివరాల నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టిన యంత్రాంగం రూరల్ ప్రాంతంలో 25 శాతం, అర్బన్ ప్రాంతంలో 15 శాతం వివరాలను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసినట్లు పేర్కొంటోంది. జిల్లా వ్యాప్తంగా అందిన దరఖాస్తులన్నీంటిని ఈ నెల 17 వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవటంతోపాటు ఆమేరకు కసరత్తు చేస్తోంది.

- ఆరు గ్యారంటీల అమల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం గత నెల 28 నుంచి శనివారం వరకు నిర్వహించిన ప్రజా పాలన సభల్లో జిల్లా వ్యాప్తంగా 7,24,271 దరఖాస్తులు రాగా, ఇందులో దాదాపు నాలుగు లక్షల వరకు కొత్త రేషన్‌కార్డులకు సంబంధించిన దరఖాస్తులు ఉంటాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.
- దరఖాస్తుల్లో 13 పురపాలక సంఘాల పరిధిలోని 289 వార్డు, డివిజన్ల నుంచి 1,79,917 దరఖాస్తులు వచ్చాయి. అలాగే, జిల్లాకు సంబంధించి జీహెచ్ఎంసీ పరిధిలోని 38 డివిజన్ల పరిధిలో 4,94,766 దరఖాస్తులు వచ్చాయి. రూరల్ ప్రాంతం కంటే అర్బన్ ఏరియాల్లో నుంచే అధిక మొత్తంలో దరఖాస్తులు వచ్చినట్లు అధికార వర్గాలు తెలిపాయి.
- జిల్లా అధికార యంత్రాంగం నియమించిన నోడల్ అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు పర్యవేక్షించేలా ఆదేశాలను జారీ చేశారు.
- సమాచారాన్ని ఎంట్రీ చేసేటప్పుడు పలు జాగ్రత్తలతోపాటు తప్పులు దొర్లకుండా ఒకటికి, రెండు సార్లు సరి చూసుకోవాలని సూచనలను అందించారు.

## డెంటల్ క్లినిక్ ప్రారంభం



**ఉప్పల్:** చిలుకానగర్ డివిజన్ ప్రశాంత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఐవరీ స్మైల్ డెంటల్ కేర్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్, డాకర్లు ఫణి తేజ్ పద్మసోలాల, హరిత రాంబట్ల తదితరులు పాల్గొన్నారు.

## శబరికి తరలిన అయ్యప్ప భక్తులు



**మల్లాపూర్:** అయ్యప్ప భక్తులు గురుస్వామి తీగుళ్ల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో మల్లాపూర్ జనప్రియటౌన్‌షిప్ గణేష్ దేవాలయంలో ఇరుముడిలతో శబరికి తరలివెళ్లారు. మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి హాజరయ్యారు.

## గౌడ కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలి



గౌడ సంఘం కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న శంకర్‌గౌడ్

**బోడుప్పల్:** గౌడ కులస్తులు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ సంఘం అధ్యక్షులు బత్తిని శంకర్‌గౌడ్ అన్నారు. చెంగిచర్ల క్రాంతి కాలనీలో ఆదివారం గౌడ సంఘం కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడ కులస్తులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా రాణించేందుకు కృషి చేయాలన్నారు. సంఘం ఉపాధ్యక్షులు బొడిగె మల్లేశంగౌడ్, ప్రధాన కార్యదర్శి నిలుగొండ వెంకటేశం గౌడ్, కోశాధికారి దుర్గపు కృష్ణగౌడ్, సహాయ సెక్రటరీ పూదరి రాజుగౌడ్, కార్యనిర్వాహక సభ్యులు పాలకుర్తి శ్రీనాథ్ గౌడ్, బత్తిని చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



**ఉప్పల్:** ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇందుమతి శిష్యబృందంనిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో భాగంగా వినాయక కౌతం, పుష్పాంజలి, ప్రహ్లాద పట్టాభిషేకం, జతిస్వరం, కాలభైరవాష్టకం, రామాయణ శబ్దం, దశావతారాలు, అన్నమాచార్య కీర్తనలు, కళాకారులూ అవిజ్ఞా, హనిషా, తన్విరిషిత, తన్మయ, గీతికా, వర్షిణి తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

## వ్యాయామంతో ఆరోగ్యం



**బోడుప్పల్:** సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవితం కోసం వ్యాయామం చేయాలని 3వ డివిజన్ కార్పొరేటర్ కొత్త చందర్‌గౌడ్ అన్నారు. చెంగిచర్ల ఎంఎల్ఆర్, అక్షయ కాలనీలో ఆదివారం ఓపెన్ జిమ్, పిల్లల పార్కును ఆయన ప్రారంభించారు. కో ఆప్షన్ సభ్యులు రంగ బ్రహ్మన్నగౌడ్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ అధ్యక్షులు కొత్త సుశాంత్‌గౌడ్, కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

## రాజకీయాలకతీతంగా అభివృద్ధి

**మల్లాపూర్:** రాజకీయాలకతీతంగా నాచారం గొల్లముత్యాల బావి కాలనీని అభివృద్ధిచేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం గొల్ల ముత్యాల బావి ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం ఏర్పాటు చేశారు. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని ఘనంగా సత్కారించారు. దశల వారీగా కాలనీలో అభివృద్ధి పనులను చేపడుతామన్నారు. గ్రేటర్ బీఆర్ఎస్ నాయకులు సాయిజెనోఖర్, కాలనీ అధ్యక్షులు నర్సింహా యాదవ్ పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఇతర నాయకులు

**మల్లాపూర్:** నాచారం రెడ్డి సంఘం సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం నాచారం భవానీనగర్‌లో నాచారం రెడ్డి సంఘం అధ్యక్షులు ఎర్ర శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నమిలికొండ భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన సంవత్సరం రెడ్డి సంఘం కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, అంపాల అనితాపద్మారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెడ్డి సంఘం అభ్యున్నతికి తమ వంతు తోడ్పాటు అందిస్తామని తెలిపారు.

## మురుగు...పరుగు

**మల్లాపూర్:** మల్లాపూర్ ఓల్డ్ విలేజ్‌లో పది రోజులుగా మ్యాన్‌హోల్ నిండి మురుగు నీరు ప్రవహిస్తోంది. దీంతో స్థానికులు దుర్గంధం వాసన భరించలేక అవస్థలు పడుతున్నారు. అధికారులకు, సిబ్బందికి ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.



## విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి

**అల్వాల్:** తెలంగాణ ప్రభుత్వం ఫీజు నియంత్రణ చట్టాన్ని, విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షులు విక్రమ్‌గౌడ్ అన్నారు. ఆదివారం వెంకటాపురం రామచంద్ర కాలనీ కమ్యూనిటీ హాలులో అంబేద్కర్ యువజన సంఘం నాయకులు భరత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షులు విక్రమ్‌గౌడ్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఆకాష్, యశ్వంత్, మహేష్, మనోజ్, కిరణ్, ప్రణయ్, శ్రవణ్, రాఘవ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షులు విక్రమ్‌గౌడ్

## చెట్లను రక్షించుకుందాం..

**కాప్రా:** సైనిక్‌పురిలోని పచ్చని చెట్లను రక్షించుకునేందుకు స్థానికులు ఆదివారం గళమెత్తారు. పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణం కలిగిన సైనిక్‌పురి ప్రాంతంలో కొందరు చెట్లు నరికివేస్తూ ఎడారిగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ప్రైవేటు టెన్నీస్ కోర్టు నిర్మాణం కోసం పార్క్ సమీపంలో ఉన్న 50 ఏళ్ల నాటి పెద్ద రావిచెట్టును నరికివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు, యువతతో పాటు మహిళలు అందరూ పెద్ద ఎత్తున రోడ్లపైకి చేరుకుని చెట్లను హత్తుకుని వాటిని కాపాడాలని నినాదాలు చేశారు. స్థానికుల నిరసనతో స్పందించిన సంబంధిత అధికారులు చెట్లను నరికిన వారికి జరిమానా విధించి నిర్మాణ పనులు నిలిపివేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులు, గ్రీన్ సైనిక్‌పురి ప్రతినిధులు చంద్రశేఖర్, హేమ, పంగజొట్టి, శంకర్ మేల్కోటి, ఫేంకోమత్ ప్రతినిధి మేధా అగాసీ పాల్గొన్నారు.



సైనిక్‌పురిలో చెట్లను కాపాడాలని నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

## రక్తదాన శిబిరం

**బోడుప్పల్:** అన్ని దానాల్లో కెల్లా రక్తదానం గొప్పదని 15వ డివిజన్ కార్పొరేటర్ కొత్త దుర్గమ్మగౌడ్ అన్నారు. టెలిఫోన్ కాలనీలో ఆదివారం రుద్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. నేటికీ చాల మందికి సకాలంలో రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, యూత్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్ దుర్గమ్మగౌడ్

## కేలండర్ ఆవిష్కరణ

**మేడిపల్లి:** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఉప్పల్ డిపో కౌడిన్య(గౌడ)సంక్షేమసంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్ 2024ను ఆదివారం మేడిపల్లిలో ఆవిష్కరించారు. అధ్యక్షుడు వేముల నాథం గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆర్.నాగభూషణం గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**రామంతాపూర్ :** భరత్‌నగర్‌లోని రెడ్డి సంక్షేమ సంఘం భవనంలో ఆదివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, రెడ్డి సంఘ అధ్యక్షుడు పసుల ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ రాష్ట్ర బీఆర్ఎస్ నేత రాగిడి లక్ష్మారెడ్డితో, 2024 నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. కుల సంఘాలు సమాజసేవలో పాల్గొనాలన్నారు.





## ప్రజలందరూ క్షేమంగా ఉండాలి



**మేడిపల్లి:** మహిమ గల తల్లులు సమ్మక్క సారలమ్మల ఆశీర్వాదంతో ప్రజలందరూ.. క్షేమంగా ఉండాలని కోరుకున్నానని పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి తెలిపారు. ఆదివారం మేడారంలో సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్న ఆయన అమ్మవార్ల వద్ద ప్రత్యేక పూజలను నిర్వహించారు. మేయర్ తో పాటు కార్పొరేటర్లు,బీఆర్ఎస్ నాయకులు మొక్కులను చెల్లించుకొని అమ్మవార్లను దర్శించుకున్నారు.

## సీపీని కలిసిన కాంగ్రెస్ నేతలు



**హబ్సిగూడ:** హబ్సిగూడ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గరిక సుధాకర్‌లు రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుదీర్ బాబును మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరం



**మేడిపల్లి:** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఆర్‌వీఫౌండేషన్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో విష్ణుపురి కాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీలత భద్రునాయక్, పన్నాల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## శ్రీరామ అక్షింతల వితరణ



**అల్వాల్:** అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం యాప్రాల్ సాయికృప ఆఫీసర్స్ కాలనీ హనుమాన్ దేవాలయం నుండి పలు కాలనీల్లో భక్తిశ్రద్ధలతో శ్రీరాముని భజన చేస్తూ భక్తులకు అయోధ్య శ్రీరాముని అక్షింతలు వితరణ చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ బాబు, ధనలక్ష్మీ, పర్వతాలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## శబరిమలకు సైకిల్ యాత్ర



**కాప్రా:** అయ్యప్ప స్వామి మండల దీక్ష చేపట్టిన మాలాధారులు ఆదివారం ఏఎస్‌రావునగర్ డివిజన్ కమలానగర్ అయ్యప్ప ఆలయం నుంచి శబరిమలకు సైకిల్ యాత్ర చేపట్టారు. స్థానిక ఆలయంలో ఇరుముడులు కట్టుకుని అయ్యప్ప నామస్మరణతో సైకిల్‌పై అయ్యప్ప దర్శనానికి బయలుదేరారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు శశిధర్‌రెడ్డి, సంతోష్, రాము, సాయి తదితరులు పాల్గొన్నారు.

## చర్లపల్లి సిప్రా కంపెనీ కార్మికుడు మృతి

**కుషాయిగూడ:** చర్లపల్లి ఫేస్-5లో గల సిప్రా క్రేన్ కంపెనీకి చెందిన కార్మికుడు ఉపేందర్ రామ్(33) మృతి చెందాడు. చర్లపల్లి సీఐ మల్లికార్జున్‌రెడ్డి, ఎస్ఐ శేఖర్ తెలిపిన కథనం ప్రకారం.. మల్లాపూర్ డివిజన్ సూర్యానగర్‌కు చెందిన ఉపేందర్‌రామ్ 20 రోజుల క్రితం చర్లపల్లి ఫేస్-5లోని సిప్రా క్రేన్ కంపెనీలో హెల్పర్‌గా చేరారు. శనివారం విధులకు హాజరైన ఉపేందర్‌రామ్ విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు కంపెనీలో రాడ్డు అతని కడుపులో గట్టిగా తగిలింది. తోటి కార్మికులు, యాజమాన్యం హుటాహుటిన ఈసీఐఎల్‌లోని శ్రీకర ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి నాచారం ఈఎస్ఐ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ ఉపేందర్‌రామ్ మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.

## వైద్య శిబిరానికి విశేష స్పందన



**అల్వాల్:** మారుతున్న సమాజానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బొల్లారంలోని వీబీ సీటీ కమ్యూనిటీ హాల్‌లో వీబీ సిటీ సీనియర్ సిటిజన్ అండ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి జీవన ప్రమాణ శైలికి అనుగునంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్యాధికారి డాక్టర్ రఘునాథ్ స్వామి, వీబీ సిటీ వాసులు సురేందర్‌రెడ్డి, రాపర్తి రమేష్ పాల్గొన్నారు.

## విరాహత్ అలీకి సన్మానం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

**మల్లాపూర్:** తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన కె.విరాహత్ అలీని ఆదివారం హెచ్‌బీకాలనీలోని శ్రీరంగనాయక స్వామి దేవాలయంలో ఆదివారం శ్రీరామానుజ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతలక్ష్మారెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సునీతలక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ట్రస్ట్ చైర్మన్, ప్రముఖ వైద్యులు డాక్టర్ ధనుంజయ, తెలంగాణ కేబుల్ ఆపరేటర్ల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు కె.ప్రభాకర్‌రెడ్డి, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## ప్రణాళికాబద్ధంగా నియోజకవర్గ అభివృద్ధి



మచ్చబొల్లారం డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

**అల్వాల్:** మల్కాజిగిరి నియోజకవర్గాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మచ్చబొల్లారం డివిజన్ పరిధిలో ఆయన ఆదివారం సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా కాలనీలో పాదయాత్రచేస్తూ కాలనీలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హెచ్ఎంటీ ఆఫీసర్స్ కాలనీ, ఓల్డ్ అల్వాల్, ఫాదర్ బాలయ్యనగర్, ఓం శ్రీసాయి నగర్‌కాలనీలలో పర్యటించారు. అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ పనులు పారిశుద్ధ్యం, శానిటేషన్, అంతర్గత రోడ్లపై చర్చించారు. పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి తన వంతు కృషి చేస్తానని మాట ఇచ్చారు. కార్యక్రమంలో డోలి రమేష్, డిల్లీ పరమేష్, పవన్‌కుమార్, కాలనీ వాసులు హబీబ్, కిషోర్, కృష్ణగౌడ్, శేఖర్, కృష్ణమాచారి, వాసుయాదవ్, కృష్ణగౌడ్, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

**మేడిపల్లి:** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ శ్రీసాయినగర్ కాలనీలో 25వ డివిజన్ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలో సాయినగర్ కాలనీ, సాయిహిల్స్ కాలనీ, విహారిక కాలని, క్రాంతికాలనీలకు చెందిన మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.



### ఆల్వాల్ సూర్యనగర్‌లో..



**అల్వాల్:** సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని అల్వాల్ సర్కిల్ సూర్యనగర్‌లో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని వివిధ రకాల ముగ్గులు వేశారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కో-ఆప్షన్ సభ్యులు జ్యోతిగౌడ్, కాలనీ కమిటీ సభ్యులు సంపత్, గురుపాదం, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

## యువ సాధికారిత అవగాహన సదస్సు



**కుషాయిగూడ:** చర్లపల్లి పారిశ్రామిక వాడలోని న్యూక్లియానిక్స్ కంపెనీలో ఆదివారం యువ సాధికారత అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీ ఉద్యోగులకు విధుల్లో నిపుణత, ఏకాగ్రత, ధ్యానం, నాయకత్వ లక్షణాలు, క్రీడల వికాసం వంటి అంశాలపై అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు.ముఖ్యఅతిథిగా వీబీఆర్ ఐటీ ప్రొఫెసర్లు శ్రీనివాస్, నాగరాజు హాజరయ్యారు. ఉద్యోగమే కాకుండా సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణ, మహిళల భద్రత, అడవుల సంరక్షణ, మాదక ద్రవ్యాల నియంత్రణలో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ అధినేతలు నిశాంత్‌రెడ్డి, ధీరజ్‌రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

## శ్రీరాముడి అక్షింతల వితరణ



**మౌలాలి:** డిఫెన్స్ కాలనీ యూత్ క్లబ్, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం డిఫెన్స్ కాలనీలో అయోధ్య శ్రీరాముని అక్షింతలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ చాడ సురేష్‌రెడ్డి, మధు, వికాస్, నవీన్‌రెడ్డి, సుబ్బు, అవినాష్, దిలీప్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, సంతోష్, సందీప్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.